
కోహెడ అంబేద్కర్ చౌరస్తాలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు, పక్కన ఎమ్మెల్యే అభ్యర్థి సతీశ్‌కుమార్

## బీఆర్ఎస్ అంటేనే

గులాబీమయమైన కోహెడ

# అభివృద్ధి, సంక్షేమం

- మూడోసారి ఎమ్మెల్యేగా వొడితెల సతీశ్‌కుమార్ పక్కా
- ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు
- హరీశ్‌రావుకు ఘనస్వాగతం పలికిన మహిళలు
- బీఆర్ఎస్‌లో చేరిన పలు పార్టీల నాయకులు


కార్యకర్తలతో కరచాలనం చేస్తున్న మంత్రి హరీశ్‌రావు

కోహెడ, నవంబర్ 21: బీఆర్ఎస్ అంటేనే అభివృద్ధి, సంక్షేమం అని ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి హరీశ్‌రావు అన్నారు. మంగళవారం కోహెడలో హుస్నాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి వొడితెల సతీశ్‌కుమార్, మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డితో కలిసి చేపట్టిన రోడ్‌షోకు కోహెడ ప్రజలు బ్రహ్మరథం పట్టారు. మంత్రి హరీశ్‌రావు, సతీశ్‌కుమార్‌లపై పూల వర్షం కురిపించారు. మహిళలు తిలకం దిద్దుతూ స్వాగతం పలికారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తాలో మంత్రి హరీశ్‌రావు మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వ్యవసాయానికి 24 గంటల విద్యుత్, రైతుబంధు, రైతుబీమా అందించి భరోసాగా నిలిచిందన్నారు. సాగు, తాగు నీరు, రోడ్లు, కల్యాణలక్ష్మి, ఆసరా పెన్షన్లు తదితర పథకాలతో ప్రజల మనసులు గెలుచుకున్నదన్నారు. మళ్లీ కారు గుర్తుకు ఓటు వేసి సతీశ్‌కుమార్‌ను ఆశీర్వదిస్తే పెండింగ్ పనులను పూర్తి చేస్తామన్నారు. హుస్నాబాద్‌లో ఆర్డీవో, విద్యుత్ కార్యాలయాలతోపాటు ఐవోసీ కార్యాలయం, 100 పడకల దవాఖానను నిర్మించినట్లు తెలిపారు. సర్పంచ్‌లకు, ఎంపీటీసీల సమక్షంలో గ్రామాల్లో రోడ్లు వేశామన్నారు. శనిగరం ప్రాజెక్ట్‌కు రూ.23 కోట్లు, సింగరాయ ప్రాజెక్ట్‌కు రూ.5 కోట్లు మంజూరు చేయించి మరమ్మతులు చేసినట్లు పేర్కొన్నారు. మోయతుమ్మెద వాగుపై 8చెక్‌డ్యాంలను నిర్మించినట్లు చెప్పారు. కరోన సమయంలో కాంగ్రెస్ ఎక్కడ పోయిందని ప్రశ్నించారు. మహమ్మారి నుంచి ప్రతి ఒక్కరినీ కాపాడుకున్నామన్నారు. కాంగ్రెస్ 6 గ్యారంటీలతో వస్తున్నదని, నమ్మి మోసపోవద్దని కోరారు. కాంగ్రెస్ మూడు గంటలు, బీజేపీ 5గంటలు కరెంట్ ఇస్తామని చెప్పడం సిగ్గు చేటన్నారు. కాంగ్రెస్, బీజేపీలను నమ్మి ఓటెయ్యొద్దని కోరారు. అనంతరం ఏఐఎస్‌బీ రాష్ట్ర కార్యదర్శి గవ్వ వంశీధర్‌రెడ్డితో పాటు వివిధ పార్టీలకు చెందిన నాయకులు సుమారు 200 మందికి మంత్రి గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి కర్ర శ్రీహరి, ఎంపీపీ కొక్కుల కీర్తి, జడ్పీటీసీ నాగరాజు శ్యామల, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆవుల మహేందర్, నాయకులు పేర్యాల రవీందర్‌రావు, ఫ్యాక్స్ చైర్మన్ పేర్యాల దేవేందర్‌రావు, సర్పంచ్ పేర్యాల నవ్య, నాయకులు కొక్కు ల సురేశ్, నాగరాజు మధుసుదన్‌రావు, అబ్దుల్ రహీం, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ప్రజలతో కలిసిపోయి మంత్రి ప్రసంగాన్ని వింటున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ తనయుడు ఇంద్రనీల్


మంత్రి హరీశ్‌రావు రోడ్‌షోకు తరలివచ్చిన ప్రజలు, బీఆర్ఎస్ నేతలతో గులాబీమయమైన కోహెడ

# హుస్నాబాద్ నీటి తండ్లాట తీర్చినం

### హామీల అమలు ఘనత బీఆర్ఎస్‌దే..

- కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను నమ్మి మోసపోవద్దు
- మోటార్లకు మీటర్లు పెట్టే బీజేపీని నమ్మొద్దు
- నియోజకవర్గం అభివృద్ధి నా బాధ్యత
- సతీశ్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి
- ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు


హుస్నాబాద్ రోడ్‌షోలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు, హాజరైన జనం

హుస్నాబాద్, నవంబర్ 21: హామీలను అమలు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌ది అయితే ఇచ్చిన హామీలను ఎగవెట్టి ప్రజలను మోసం చేసిన చరిత్ర కాంగ్రెస్‌దని ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. పదేండ్లుగా ప్రజల సమస్యలు పట్టించుకోని కాంగ్రెస్ నాయకులు ఎన్నికలు రాగానే ఎన్ని అబద్ధాలు చెప్పయినా అధికారంలోకి రావాలని చూస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ హుస్నాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి సతీశ్‌కుమార్‌కు మద్దతుగా మంగళవారం రాత్రి హుస్నాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో నిర్వహించిన రోడ్‌షోకు మంత్రి హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ బీఆర్ఎస్ పథకాలను, మ్యానిఫెస్టోను కాపీ కొట్టి ప్రజలను నమ్మించే కుట్ర చేస్తున్నదని మండిపడ్డారు. బాయి కాడ మోటర్లకు మీటర్లు పెట్టకుంటే రూ.35వేల కోట్ల నిధులను ఆపామని స్వయంగా కేంద్ర మంత్రి నిర్మలాసీతారామన్ ఒప్పుకోవడం బీజేపీ రైతు వ్యతిరేక విధానాలకు నిదర్శనమన్నారు. పదేండ్లలో నియోజకవర్గంలో రూ.కోట్లతో అభివృద్ధి జరిగిందన్నారు. కరీంనగర్ నుంచి తరిమికొడితే ఇక్కడికి వచ్చి మాయమాటలు చెప్పేవారి మాటలు నమ్మొద్దన్నారు. నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

### మరోసారి ఆశీర్వదించండి

హుస్నాబాద్ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశానని, రాబోయే రోజుల్లోనూ రోల్ మోడల్‌గా చేస్తానని ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ అన్నారు. గౌరవెల్లి రిజర్వాయర్‌ను గోదావరి నీళ్లతో నింపామని, చెరువులు, కుంటలను అభివృద్ధి చేశామని తెలిపారు. 16విద్యుత్ సబ్‌స్టేషన్లు నిర్మించి నాణ్యమైన కరెంట్ అందిస్తున్నామన్నారు. రైతు సంక్షేమమే లక్ష్యంగా పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. 100 పడకల దవాఖాన, ఐవోసీ భవన నిర్మాణం, డిపోను అభివృద్ధి చేశామన్నారు. సీఎంకేసీఆర్, మంత్రి హరీశన్న సహకారంతో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఎన్నికల ఇన్‌చార్జి, మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకట్, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనితారెడ్డి, ఎంపీపీ లకావత్ మానస, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రజనీతిరుపతిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పేర్యాల రవీందర్‌రావు, వెంకట్రాంరెడ్డి, అన్వర్, తిరుపతిరెడ్డి, ఆకుల వెంకట్, చిట్టి గోపాల్‌రెడ్డి, అయిలేని మల్లికార్జున్‌రెడ్డి, గవ్వ వంశీధర్‌రెడ్డి, కౌన్సిలర్లు, సర్పంచ్, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ వార్డు ఇన్‌చార్జిలు, గ్రామాల అధ్యక్షులు, కమిటీ సభ్యులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


మంత్రి హరీశ్‌రావు రోడ్‌షోకు హాజరైన బీఆర్ఎస్ కార్యకర్తలు, ప్రజలు


హుస్నాబాద్ రోడ్‌షోలో అభివాదం చేస్తున్న మంత్రి హరీశ్‌రావు